# నిశ్శబ్దం! నిశ్శబ్దం!!

అనగనగా ఒక రాజకుమారి. ఆమెను రాక్షసుడెత్తుకొనిపోయి ఒక ఎత్తైన ఒంటి స్తంభం మేడలో బందీ చేసి వుంచాడు. రాజకుమారుడు వచ్చి రాక్షసున్ని చంపి చెర విడిపిస్తాడని.... చిన్నప్పుడు నాయనమ్మ చెప్పిన కథ ఎన్నిసార్లో గుర్తుకు వచ్చింది సుకన్యకు. పెళ్ళి చేసుకొని ఆమె భర్త ఆదిత్య హైద్రాబాద్ బేగంపేటలోని ఆకాశాన్ని అంటే మేడలో ఆరో అంతస్తులో వున్న ఆరొందల నాలుగో నెంబరు అపార్టుమెంటులో తెచ్చిపెట్టాడు.

ఆదిత్య కంప్యూటరు ఇంజనీరు. హైటెక్ సిటీలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో షిప్ బిల్డింగు ప్రాజెక్టులో పనిచేస్తున్నాడు. ఆ పని మధ్యలో విడిచిపెట్టి అమెరికా వెళ్ళిపోకుండా వుండడానికి వాళ్ళు బాగానే జీతమిస్తున్నారు. ఆదిత్య కంప్యూటర్ ముందు కూర్చుంటే షిప్ ఒంపు సొంపుల్లోనే మునిగిపోతాడు. రాత్రి పగలు తెలియదతనికి ఆ ఎయిర్‌కండిషన్ ఆఫీసులో, నియాన్ లైట్ల వెలుగులో.

ఆదిత్య రోజు లాగానే పొద్దున్నే వెళ్ళిపోయాడు. బ్రేక్‌ఫాస్టు, లంచ్, డిన్నర్ అన్నీ ఆఫీసులోనే. "తన ఒక్కదానికే వంట ఏం చేసుకోవాలి?" నిట్టూర్చింది సుకన్య. చాయ్ చేసుకొని తాగుదామని సుకన్య వంటింట్లోకి వెళ్ళింది. మెల్లగా గిన్నెలో నీళ్ళు పోసి పొయ్యి మీద పెట్టింది. మైక్రోవేవ్‌లో పెడ్తే మరీ తొందరగా అయిపోతుంది. సుకన్యకది ఇష్టం లేదు. బాల్కనీలోకి పోయి నిలబడింది. ఊర్లో మొన్నటివరకూ అమ్మావాళ్ళ ఇంట్లో కట్టెలపొయ్యి మీద ఏది వండినా రుచిగా వుండేది. పప్పు మెల్లగా వుడికేది ఎంత రుచో! మొక్కజొన్నలు, చిక్కుడు గింజలు, అనుములు, వాటితో చేసిన గుడాలు ఎంత బాగుండేవి! నిట్టూర్చింది సుకన్య. బాల్కనీలోంచి ఎదురుగా హుస్సేన్‌సాగర్ నీలిమేఘం కిందికి దిగినట్లుగా నిశ్చలంగా వుంది. నెక్లెస్ రోడ్డు మీద అప్పుడే కార్ల బార్లు! నిశ్శబ్దంగా జారిపోతున్నాయి. రోడ్డు పక్కనున్న పచ్చని లాన్‌లో అప్పుడే ప్రేమ జంటలు! వాళ్ళకు ఆదిత్యకు లాగా ఆఫీసు పనుల్లేవా? నిట్టూర్చింది సుకన్య.

రాక్షసుడెత్తుకపోయి ఒంటి స్తంభం మేడ మీద వుంచిన రాజకుమారిని నేనేనా! నన్ను ఎత్తుకొచ్చిన రాక్షసుడెవరు? ఈ రాక్షసుని బారి నుంచి నన్ను రక్షించే రాజకుమారుడెవరు? ఎప్పుడొస్తాడు? - నవ్వింది సుకన్య.

పెళ్ళయిన పిల్ల పరాయి మొగాడి గురించి ఆలోచించకూడదని నాయనమ్మ చెప్పింది కదా! - నవ్వింది సుకన్య. విరబోసుకున్న పొడుగాటి వెంట్రుకలను ముడిగా చుట్టుకొని సుకన్య

లోపలికి వచ్చింది. నీళ్ళు మసులుతున్నాయి. చాపత్తా వేసింది. చక్కెర వేయబోయి ఆగింది. నేను లావు అవుతున్నానని ఆదిత్య అన్నాడు. లావుగా వుంటే అతనికి నచ్చదన్నాడు. అందుకని చక్కెర తక్కువ వేసుకుంటే మంచిది. ఒక్కటే స్పూను చక్కెర వేసింది. పాలు పోసింది. చాయ్‌ను మగ్గులో పోసుకొని హాల్లోకి వచ్చింది. డైనింగు టేబుల్ కుర్చీలు సోఫాలు అన్నీ అందంగా శుభ్రంగా అమర్చి వున్నాయి. అమ్మానాన్నలు కట్నంగా ఇచ్చిన డబ్బులోంచే ఆదిత్య యీ ఫర్నీచరంతా కొన్నాడు. వాటిని అతనే సెలక్ట్ చేసాడు. అతనే అమర్చాడు.

"నీకు అంత మంచి టేస్టు వున్నట్టు లేదు" అన్నాడు ఆదిత్య తను కట్టుకున్న చీరను దాని రంగును చూసి. నవ్వి ఊరుకుంది సుకన్య. అందుకేనేమో కిటికీ తెరల దగ్గర్నుంచీ ఆయన సెలక్షనే!

సుకన్య మెల్లగా చాయ్ తాగుతూ వుంది. ఎదురుగా పెద్ద స్క్రీన్‌తో టీవీ. తనకు తోడు అదే. టీవీలో యాభైకి పైగా ఛానెళ్ళు. రిమోటు నొక్కగానే కావల్సిన ప్రోగ్రాం! అల్లావుద్దీను ల్యాంపా! పాతాళభైరవి బొమ్మా! ఆ రిమోట్. హో! నిజంగా అవే అయితే నన్ను ఇక్కడ్నుంచి తీసుకుపొమ్మని కోరుకునేదాన్ని! నవ్వింది సుకన్య.

ఈ ఒంటరితనం, నిశ్శబ్దం భరించలేనిక! తన పక్కన ఎవరైనా వుంటే ఎంత బాగుండును! మాట్లాడుకోవడానికి పోట్లాడుకోవడానికి... స్కూల్లో తన దోస్తు నిర్మల ఎంతగా ఒర్లేది! అప్పుడది ఒర్లితే తను విసుక్కునేది. ఇప్పుడా నిర్మల పక్కనుంటే ఎంత బాగుండును! నిట్టూర్చింది సుకన్య.

ఈ మేడలో పక్క అపార్టుమెంటులో ఎవరుంటారో కూడా తెలియదు. "తెలుసుకోవడం అనాగరికం. వాళ్ళు పిలవకుండా నువ్వు ఎవరింటికి వెళ్ళొద్దు" అని ఆదిత్య చెప్పాడు. వచ్చి పది నెలలయింది. ఇంతవరకూ ఎవరూ కన్పించలేదు తనకు. ఆదిత్య ఇంట్లో వుండేది తక్కువ. ఎన్ని గంటలుంటాడు ఎనిమిది.... పదిగంటలా! వాటిల్లో ఏడెనిమిది..... తొమ్మిదిగంటలు నిద్ర. బాత్రూమ్‌లో ఓ గంట షేవింగు స్నానం... బట్టలేసుకోవడం ఏదైనా మాట్లాడాలని సుకన్య ప్రయత్నిస్తే ఊఁ... ఆఁ... అంటాడు. బ్రేకుఫాస్టు ఎక్కువ ఆఫీసు లోనే. ఇంట్లో బ్రేకుఫాస్టు తింటే ఆమ్లెట్, టోస్టు, కాఫీ. తొందర! తొందర! ఆ తొందరలో కూడా టోస్టు ఎక్కువ కాలిందంటాడు. ఆమ్లెటు సగం సగమే కాలాలంటాడు. ఇట్లా ఎక్కువ కాలకూడదంటాడు. కాఫీ పొడి ఏది కొన్నావు? ఏం బాగాలేదు. ఈసారి కాఫీ పొడి నువ్వు కొనొద్దు. నేను తెస్తాను! అంటాడు. తొందర! తొందర! సగం కాఫీ వదిలేసి ఆఫీసు బ్యాగుతో బయటికి వెళ్ళిపోతాడు. సుకన్య ఉరుక్కుంటూ అతన్ని చేరుకునేసరికే అతడు లిఫ్టులో క్షణంలో కిందికి. అంతే! ఆదిత్యతో తను మాట్లాడే మాటలు లెక్కపెడ్తే రోజుకు ఎన్ని ఉంటాయి! ఒకటి... రెండు... మూడు... అట్లా వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు.

సుకన్య చాయ్ తాగి టీవీ ఆన్ చేసింది. వార్తలు వస్తున్నాయి. ఎవరో హత్య

చేయబద్దారు. రక్తం! గుంపులు గుంపులుగా జనం! పోలీసులు! సుకన్య చానెల్ మార్చింది. ఎవరో వారఫలాలు చెప్తున్నారు. టీవీలోనూ వారఫలాలు! జ్యోతిషమా! మరో చానెల్ మార్చింది. అర్ధనగ్నంగా వున్నవాళ్ళు తల పగిలేట్టుగా అరుస్తూ పాటలు! వాళ్ళకు కట్టుకునేందుకు బట్టలు లేవా? - అని ఊర్లో పాలేరు కొడుకు అన్న మాటలు గుర్తుకు వచ్చి నవ్వింది సుకన్య. టీవీ ఆఫ్ చేసింది. మళ్ళీ నిశ్శబ్దం! ఇల్లంతా నిశ్శబ్దం. ఆమె ఊపిరి పీల్చే చప్పుడు ఆమెకు వినిపిస్తూ వుంది. కమ్మరి తిత్తిలో గాలి నిండి బయటికి వచ్చినట్లుగా బుస్సు... బుస్సు... అనీ. ఆ చప్పుడుకు భయమేసింది సుకన్యకు. హాల్లోని బాల్కనీలోకి పోయి బయటికి చూసింది. ఎదురుగా పైకి లేచి ఆకాశాన్నంటే అపార్టుమెంట్లు. ఎటు చూసినా అవే. రాక్షసుని కోరల్లా. కబంధ హస్తాల్లా! వాటిల్లో ఎంతమంది తనలా ఒంటరిగా నిశ్శబ్దంలో కూరుకొని పోయి... ఆపైన ఆకాశంలో అనంతవిశ్వంలో తిరిగే గ్రహాలు నక్షత్రాలు బ్లాక్‌హోల్స్ అంతటా భరించరాని నిశ్శబ్దం నిండిపోయి వుంటుందా! - వణికిపోయింది సుకన్య. గట్టిగా ఊపిరి పీల్చుకొని కిందికి చూసింది. పాతాళంలోలా కింద రోడ్లు. రోడ్ల మీద బొమ్మల్లాంటి కార్లు, బస్సులు, లారీలు. చీమల్లా వేగంగా కదులు తున్నాయి. మనుషులు అక్కడక్కడా నల్లగా బొట్లు బొట్లుగా కన్పిస్తున్నారు కదులుతూ. సుకన్యకు కళ్ళు తిరిగాయి.

ట్రిన్... ట్రిన్... అని డోరు బెల్లు. నిశ్శబ్దాన్ని చీల్చుకొని వచ్చిన ఆనందం వెల్లువ. తలుపు తీస్తే - అమ్మో! తలుపుకున్న చిన్ని అద్దంలోంచి చూడకుండా తలుపు తీయవద్దని ఆదిత్య స్ట్రిక్టు ఆర్డర్. చూస్తే పనిమనిషి రాజమ్మ. రాజమ్మ ఒక్కపూట వస్తుంది. దబదబ మెషీన్‌లా తన పని చేసుకొని వెళ్ళిపోతుంది. సుకన్య ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించింది కొత్తలో. "అమ్మో! నేను జల్దీ పోవాలె. ముచ్చట్లు పెట్టుకుంట కూర్చుంటే ఇంకా రెండిండ్లలో పనుంది" అని దబదబా పనుల్లో మునిగిపోయింది. సుకన్య నిట్టూర్చింది - రాజమ్మ ఓ మెషీన్‌లా మారింది!

పెళ్ళయి వచ్చిన కొత్తలో సుకన్య ఆదిత్యకు ఆఫీసుకు ఫోను చేసి "ఎప్పుడొస్తారు?" అని ముద్దుగా మొదలుపెట్టింది. కాని ఆదిత్య కోపంతో "నన్నిట్లా డిస్టర్బు చేయకు. తెలిసిందా?" అని అరిచాడు. మెషీన్లతో పన్జేసేవాళ్ళు మెషీన్లలా అయిపోతారా! ఆదిత్యకు మంచి భవిష్యత్తుందని నాన్న ఏరికోరి బోలెడు కట్నం పోసి ఈ సంబంధం చేసాడు! అర్ధరాత్రి వరకెప్పుడో ఆదిత్య ఇంటికి వస్తాడు. "నేను తిని వచ్చాను" అని నైట్‌డ్రెస్సులోకి దూరిపోయి పక్కమీద పడిపోతాడు. ఎదురుచూసి ఎదురుచూసి అలసిపోయిన సుకన్యకు అప్పుడు అన్నం తినబుద్ధి కాదు. ఆదిత్య పక్కన చేరుతుంది. అతనికి దగ్గరగా జరుగుతుంది. "నాకు నిద్ర వస్తూంది. అలసిపోయాను ఊఁ..." అంటాడు ఆదిత్య. రాగానే నిద్ర, సుకన్య నిద్ర రాక కోరికలు శరీరాన్ని మనస్సును మెలికలు పెడ్తూంటే పక్కలో దొర్లుతుంటుంది. వయస్సులో వున్నవాళ్ళు. కొత్తగా పెళ్ళయిన వాళ్ళు రోజూ సెక్సులో పాల్గొంటారని తన దోస్తు నిర్మల చెప్పింది. "ఒక్కసారేమిటే ఖర్మ..." అని చిలిపిగా నవ్వింది కూడా. ఆదిత్య పొద్దంతా

కంప్యూటర్ ముందు కూర్చొని షిప్పు కోణాలను ఒంపులను తాకుతూ అలసి పోతాడేమో! చీకట్లో నిశ్శబ్దంలో సుకన్య ఆలోచించి ఆలోచించి చివరకు ఏ తెల్లవారు ఝామునో నిద్రలోకి జారుకుంటుంది బ్లాకుహోల్లోకి వెళ్ళిపోతున్నట్లుగా.

తెల్లవారింది.

పనిమనిషి రాజమ్మ వెళ్ళిపోయింది ఎప్పుడో - అంతా నిశ్శబ్దం.

ట్రిన్... ట్రిన్... అని మళ్ళా బెల్లు. అబ్బ ఎంత బాగుందా శబ్దం. చిన్ని అద్దంలోంచి చూసింది. అమ్మా నాన్న! తబ్బిబ్బయింది సుకన్య. తలుపు తీసింది ఆనందంతో.

అమ్మా నాన్నలు సోఫాలో కూర్చున్నారు. సుకన్యకు కన్నీళ్ళు జలజలా రాలాయి.

"సుక్కూ..." అంది తల్లి కలవరంగా.

"ఆనందబాష్పాలు" అంది సుకన్య.

"అల్లుడుగారు లేరా?" నాన్న ప్రశ్న. సుకన్య లేరన్నట్లుగా తలూపింది.

"అమ్మా! ఇక్కడికి రాలేదెందుకు?" విషాదంగా సుకన్య ప్రశ్న.

"నిన్న వచ్చాం. హోటల్లోనే దిగుతాం కదమ్మా ఎప్పుడూ. ఇప్పుడు కూతురింటికి వస్తే నలుగురేమనుకుంటారు" అంది తల్లి.

నాన్న టేబుల్ మీదున్న బిజినెస్సు రివ్యూ తీసుకొని పేజీలు తిప్పేస్తున్నాడు.

"చిక్కిపోయావేం, ఏమైనా విశేషమా?" అడిగింది చిరునవ్వుతో తల్లి. లేదని తలూపింది సుకన్య.

"చిక్కిపోవడమేమిటి లావు అయితేనూ! అయినా బ్లొజులు పట్టకుండా కాదులే."

"పిల్స్ వాడుతున్నావా? జాగ్రత్త. పిల్స్‌కు సైడ్ ఎఫెక్ట్స్ వుంటాయట" అంది తల్లి.

"స్టేట్స్ పోవాలని ఆదిత్య... పిల్లలు స్టేట్స్‌లో పుడ్తే వాళ్ళకు నేచురల్ సిటిజన్‌షిప్ వస్తుందనీ..." సుకన్య పూర్తి చేయలేదు.

"అల్లుడుగారు చెప్పేది బాగానే వుంది" అన్నాడు తండ్రి బిజినెస్సు రివ్యూలోంచి తల పైకెత్తి.

"నాన్నా! నాకు స్టేట్స్ పోవాలని లేదు... నా ఫ్రెండు లలిత వుంది కదా అక్కడ. అక్కడేం బాగుండదని చెప్పింది. మరీ ఉద్యోగం లేనివాళ్ళు వుండలేరట. ఒంటరితనం... బోరు అట" అంది.

"పిచ్చిపిల్ల! అదృష్టం వస్తే వద్దంటావు. ఆదిత్యకు మంచి భవిష్యత్తు వుందక్కడ. బోలెడు డబ్బు!... కోరుకున్న సుఖాలు!..." నవ్వాడు తండ్రి.

సుకన్య నిట్టూర్చింది.

"అల్లుడుగారు ఎప్పుడు వస్తారో యేమో. మరి మేం పోతాం. మళ్ళీ వచ్చినప్పుడు కలుస్తామని చెప్పు. జాగ్రత్త తల్లీ..." అంది తల్లి. ఇద్దరూ లేచారు.

"అమ్మా! భోజనం"

"ఇప్పుడేం భోజనమమ్మా" అంది తల్లి ఆప్యాయంగా.

తల్లీ తండ్రి వెళ్ళిపోయారు. అంతా నిశ్శబ్దం, ఒంటరితనం. బెడ్రూంలోని కిటికీ దగ్గరికెళ్ళి బయటికి చూసింది సుకన్య. కింద దూరంగా కార్లు, స్కూటర్లు, ఆటోలు, బస్సులూ పరిగెత్తుతున్నాయి. అంతటా నీరవం! నిశ్శబ్దం! కాలుష్యం పొగలు మంచు పొగలా! - తానుపుట్టిన ఊరిలోని పచ్చని వేపచెట్లు, రావిచెట్లు, ఊరి బయట ఊడలు దిగిన మర్రి చెట్టు సుకన్యకు జ్ఞాపకం వచ్చాయి. పచ్చని పొలాలు. వర్షం కురిస్తే ఎక్కడ చూసినా నీళ్ళగుంటలు. లంగా కుచ్చిళ్ళను చేతుల్తో పైకెత్తుకొని ఆ నీళ్ళను దున్నుకుంటూ నడవడం మనస్సులో కదలాడాయి. "బురదలోకి పోకే సుక్కూ" అమ్మ కేకలు. అమ్మకేకలు వినపడ్డా వినపడనట్లుగా వీధుల వెంట పరిగెత్తడం! ఇక ఇంటి డాబా మీదికి పోతే జామచెట్ల మీద బోలెడన్ని చిలుకలు. ఎర్రని ముక్కుల్తో పచ్చని ఆకుల్లో కలిసిపోయి పచ్చని చిలకలు. జామకాయలు తెంపడం మరిచిపోయి వాటినే చూస్తూ వుండడం. ఒకరోజు ఒక చిలుక పిల్ల డాబా మీదికి రావడం ఎగురలేకపోవడం. దాన్ని పట్టి పంజరంలో పెట్టడం "చిలుకను పంజరంలో పెడ్తేనే రామదాసుకు జైలు అయింది. ఒద్దు తల్లీ దాన్ని విడిచిపెట్టు" అని నాయనమ్మ వేడికోలు. తాను ఊఁ... ఊఁ... అనడం.... అట్లా చిలుకను పంజరంలో పెట్టిన పాపానికేనా తనకీ శిక్ష! ఏకాంతం! నిశ్శబ్దం! ఎన్నాళ్ళు యీ శిక్ష! రామదాసును రామలక్ష్మణులు వచ్చి విడిపించారట! నన్నెవ్వరు విడిపిస్తారు? సుకన్య బయటికి చూసింది. ఎక్కడా పచ్చదనం లేదు. అంతటా అపార్టుమెంట్లు. వాటి మీద పొగచూరిన మూకుడులా ఆకాశం!

అమెరికాలో సాన్‌ఫ్రాన్సిస్కోలో ఇంతకన్నా ఎత్తైన అపార్టుమెంట్లు ఉంటాయట. అది తలచుకోగానే సుకన్యకు ఎవరో గొంతుపట్టి పిసికినట్లయింది. ఊపిరాడలేదు. లలిత భర్తకు ఆ దగ్గరే సిలికాన్ వ్యాలీలో కంప్యూటరు ఉద్యోగం. రాత్రీ పగలూ సెలవురోజా అనకుండా ఆయన ఎప్పుడూ కంప్యూటరు ముందే అట. పాపం లలిత! నాలాగే ఆ దూరదేశంలో, కొత్త చోటులో.

సుకన్యకు ఏడ్పు వచ్చింది. కళ్ళు ఎర్రబడ్డాయి. కన్నీళ్ళు జలపాతంలా బయట కురికాయి. దట్టంగావున్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ ట్రిన్... ట్రిన్ అని డోరు బెల్లు.

సుకన్య కళ్ళు తుడుచుకొని చిరునవ్వుతో తలుపు తీసింది. ఆదిత్య! చిన్న అద్దంలోంచి చూసినప్పుడే తెలుసు ఆదిత్య అని. ఇప్పుడెందుకు వచ్చాడబ్బా ఎన్నడూ లేంది?

"ఏమిటి ఇంత ఆలస్యం. ఎందుకిట్లా ముఖమంతా ఉబ్బిపోయి వుంది. నిద్రా! ఇంకేం పని నీకు నిద్ర తప్ప" ఎత్తి పొడుపు.

తను కాన్వెంట్‌లో చదువుకోలేదని ఇంగ్లీషు మాట్లాడలేనని ఆదిత్యకు కోపమా? నిరాశా? అయితే తననెందుకు చేసుకున్నాడు. డబ్బు! అమెరికా పోయేంతవరకు సపోర్టు! "ఈ టైమ్... మీరు వస్తా... రని అనుకో... లేదు" ఆగుతూ ఆగుతూ అంది సుకన్య.

"ఊఁ..." ఆదిత్య విసురుగా లోపలికి వచ్చాడు. బెడ్రూంలోకి వెళ్ళాడు.

"అమ్మా నాన్న వచ్చారు... మళ్ళా వస్తామన్నారు" సుకన్య అతని వెంట ఉరుకుతూ అంది.

"సరే!... ఈరోజు మా బాస్ ముగ్గురు ఫారెన్ డెలిగేట్స్‌ను భోజనానికి పిల్చాను రాత్రికి. నువ్వు వంటేం చెయక్కర్లేదు. హోటల్ నుంచి చైనీస్ తెప్పిస్తాను."

"నేను వండు...తాను. హోటల్... నుంచి... ఎందుకు?"

"నువ్వు చేసే వంటలు వాళ్ళకు నచ్చవు" వంట కూడా సక్కంగా రాదంటే సుకన్యకు బాధేసింది.

ఆదిత్య గబగబ బెడ్రూమ్‌లోకి పోయి చేతిలో ఫైల్‌తో బయటికి వచ్చాడు.

"ఈ ఫైల్ కోసమే వచ్చాడు. లేకపోతే ఫోను చేసేవాడు రాత్రి డిన్నరు గురించి. అది అతని పర్సనల్ ఫైల్. డిగ్రీలు వగైరా వున్నాయి. అదెందుకు తీసుకుపోతున్నాడు?" సుకన్య కర్థం కాలేదు.

"ఎనిమిదికల్లా వస్తాను. అంతా శుభ్రంగా వుంచు" అని ఆదిత్య ఫైల్ కాగితాల మీద నుంచి సుకన్యవైపు చూపువిసిరి "కాస్త పార్లరుకు పోయి బాగా తయారవు. ఆ జిడ్డు ముఖంతో..." గబగబా వెళ్ళిపోయాడు ఆదిత్య.

ఆదిత్య వెళ్ళిపోగానే సుకన్య ఇల్లంతా డస్టింగు చేసింది. చేస్తూ చేస్తూ తనను తాను అద్దంలో చూసుకుంది. చెయ్యిని నడుం కిందగా పెట్టుకొని "ఇక్కడ కాస్త లావెక్కానంతే" ఇంట్లో కూర్చుని లావెక్కకపోతే ఏమౌతుంది! చిరునవ్వు విరిసింది పెదవుల మీద. అపార్టుమెంట్ల కిందనే బ్యూటీ పార్లరు. లిఫ్టులో బయలుదేరింది. లిఫ్టుబాయ్ తప్ప ఎక్కడా ఎవరూ కన్పించలేదు. అంతా నిర్మానుష్యం! నిశ్శబ్దం! బ్యూటీ పార్లర్‌లో ఎవరూ గట్టిగా మాట్లాడ్డం లేదు. వెళ్ళి కుర్చీలో కూర్చుంది. తనకేం కావాలో చెప్పింది. చైనీస్‌లాగా కన్పించే ఆ అమ్మాయి వేళ్ళు టకటక కదిలాయి. త్రెడింగ్ ఫేషియల్ లైట్‌గా మేకప్పు కళ్ళకు కాటుక, కనురెప్పలను తిప్పుతూ మస్కరా లిప్‌స్టిక్, వెంట్రుకలను మెట్లుమెట్లుగా అమర్చి అందమైన క్లిప్పు పెట్టింది. తనుతాను నిలువుటద్దంలో చూసుకుంది. "అందంగా వున్నాను" నవ్వుకుంది. ఆ చైనీస్‌లాగా

కన్పించే అమ్మాయికి డబ్బు ఇచ్చేసి బయటికి నడిచింది. తోవలో ఫ్లారిస్టు షాపులో తాజా పూలు కొన్నది. లిఫ్టు అపార్టుమెంటు మళ్ళా తోవలో ఎవరూ కన్పించలేదు. ఆ ఇళ్ళల్లో ఎవరుంటారు? ఎప్పుడు ఎవరూ కన్పించరేమిటి? సుకన్య ఇంట్లోకి వెళ్ళింది. తెచ్చిన పూలను ఫ్లవర్ వాజుల్లో అమర్చింది. వాటి అందాన్ని చూస్తూ నిలబడిపోయింది.

ట్రిన్... ట్రిన్... డోరుబెల్లు. తలుపు అద్దంలో నుంచి చూస్తే తెల్లటి పొడుగాటి టోపీల్లో హోటల్ వాళ్ళు. వాళ్ళు అంత పెద్ద టోపీలెందుకు పెట్టుకుంటారు? - వాళ్ళు తెచ్చిన వంటకాలన్నీ వంటింట్లో పెట్టించింది. చికెన్ మంచూరియా, చికెన్ సిక్స్టీ ఫైవ్, జింజర్ ప్రాన్సు, ఫిష్ ఫ్రై, న్యూడుల్సు, రైస్ అన్నీ చైనీసు. నేనైతే మన వంటకాలే చేసి వుండేదాన్ని. అవి బాగా వుండవనే ఆదిత్య హోటల్ నుంచి తెప్పించాడు! చైనీసు వంటకాల క్కావల్సిన డిష్ ప్లేట్లు కట్లేరీ తయారుగా పెట్టింది. ధగధగ వజ్రాలతో మెరిసే బంగారు రిస్ట్‌వాచ్‌లో టైమ్ చూసింది. పావు తక్కువ ఎనిమిది!

ట్రిన్... ట్రిన్... డోరు బెల్లు.

ఈ డోరు బెల్లు శబ్దమే తన జీవితంలో సందడి. లేకపోతే అంతా నిశ్శబ్దం. మనుషుల పలకరింపులు లేవు. పక్షుల కిలకిలా రావాల్లేవు. చెట్ల కొమ్మలు గాలికి ఊగుతూ అయ్యే సవ్వడులు లేవు. నిశ్శబ్దం! అంతా నిశ్శబ్దం! ఈ అపార్టుమెంట్లు కాకులు దూరని కారడవి. చీమలు దూరని చిట్టడివి! - మళ్ళా తలుపు తీసింది. తలుపు అద్దంలో నుంచి చూసినప్పుడే తెలుసు - వచ్చింది ఆదిత్య అని. ఆదిత్య అలసటగా కన్పించాడు.

"అట్లా నోరు వెళ్ళబెట్టి నిలబడకు. లోపలికి రానిస్తావా లేదా?" ఎందుకంత కోపం అతనికి. నవలల్లో వర్ణించే, సినిమాల్లో చూపించే ప్రేమ, చిలిపిచేష్టలు నిజంగా జీవితంలో వుండవా?

"పక్కకు జరుగుతావా? లేదా?" కర్కశంగా ఆదిత్య గొంతు. సుకన్య ఉలిక్కిపడింది. "గెస్టులు రాలేదా?" అనుకుంది. కాని అడుగలేదు.

"అంతా రెడీనా?" అని అంటూ ఆదిత్య తలుపు తెరిచాడు. అతని వెనుక పెద్ద అట్ట డబ్బాతో ఒకతను. డబ్బాను వంటింట్లో పెట్టించాడు.

"డ్రింక్స్‌కు కట్ గ్లాసులు తీసావా?" మళ్ళా అదే కోపం. సుకన్య తలూపింది.

"ఇదిగో వచ్చిన గెస్టుల ముందు అట్లా గొర్రెలా తలూపకు. అట్లా తలూపడం వాళ్ళ దగ్గర అమర్యాద. తెల్సిందా?"

సుకన్య సరే అన్నట్లుగా తలూపబోయి ఆగి "సరే!" అంది. ఆదిత్య బాత్రూమ్‌లోకి పోయి స్నానం చేసి బట్టలు మార్చుకొని వచ్చాడు.

ట్రిన్... ట్రిన్... డోరు బెల్లు. ఆదిత్య తలుపు తెరిచాడు. ఎదురుగా గెస్టులు! వాళ్ళు లోపలికి వచ్చారు. ఆదిత్య మెల్లిగా జనాంతికంగా తనకే వినబడేట్లుగా -

"నోరు తెరిచి అట్లా నిలబడకు పల్లెటూరి మొద్దులా" అన్నాడు. ఆదిత్య ఆమెను వాళ్ళకు పరిచయం చేసాడు. వాళ్ళు ఆమెకు షేక్‌హ్యాండు ఇయ్యబోయారు. సుకన్య అయోమయంగా రెండు చేతులు జోడించి 'నమస్తే' అంది.

"పల్లెటూరి మొద్దు. షేక్‌హ్యాండు ఇస్తే నీ పాతివ్రత్యం పోతుందా?" కోపంతో జనాంతికంగా ఆదిత్య పళ్ళు కొరికాడు. గెస్టులు కూడా నమస్తే అని సోఫాల్లో కూర్చున్నారు. ఆదిత్య "ఎక్స్‌క్యూజ్‌మీ" అని వంటింట్లోకి పోయాడు. అతని వెనుక సుకన్య. డబ్బాలోంచి విస్కీ సీసాలు తీసాడు. ట్రేల్లో ఆ సీసాలు కట్ గ్లాసులు ఐస్ క్యూబులు అమర్చాడు. ఇద్దరూ ట్రేలతో బయటికి వచ్చారు. గెస్టులనడిగి ఆదిత్య డ్రింక్స్ వాళ్ళ అభిరుచుల అనుసారంగా గ్లాసుల్లో పోసాడు. అందరూ గ్లాసులు పైకెత్తారు.

"యువర్ మిసెస్?" అడిగారు గెస్టులు.

వెంటనే ఆదిత్య ఆమె చేతికి కోకోకోలా గ్లాసు అందించాడు.

అందరూ గ్లాసులను పైకెత్తి ఒక్కచోట చేర్చారు. "క్లిన్" అని చప్పుడు. సుకన్య వాళ్ళ గ్లాసులతో తన గ్లాసు చేర్చింది.

"చియర్స్! చియర్స్ ఫర్ ఆదిత్య!" అన్నారు అందరూ.

సుకన్య లోపలికెళ్ళి చికెన్లు, ఫిష్ ప్రాన్స్ తెచ్చింది. అవి తింటూ ఎడతెగని మాటలు! సుకన్య కక్కడ ఊపిరాడలేదు. గుండె బరువెక్కినట్లయింది. వంటింట్లోకి పరుగెత్తింది. బాల్కనీలో నిలబడితే లైట్ల వెలుగులో బుద్ధుడు. నిశ్చలంగా, గట్టిగా ఊపిరితిత్తుల నిండా గాలి పీల్చుకుంది. ఆదిత్య వెనుకనే వచ్చాడు. తనను పలకరించకుండానే ప్లేట్లల్లో మరిన్ని వంటకాలు తీసుకొని పోయాడు. సుకన్య మెల్లగా హాల్లోకి పోయింది. ప్లేట్లల్లో చికెన్, ఫిష్, ప్రాన్స్, న్యూడుల్స్, రైస్ అన్నీ మాయమవుతున్నాయి. "వెరీగుడ్ ఫుడ్!" అన్నారు గెస్టులు.

"మిసెస్ ఆదిత్య యీజ్ వెరీగుడ్ కుక్" అన్నాడో గెస్టు.

"ఇంకా మీరు హైద్రాబాద్ బిర్యానీ రుచి చూడలేదు. నెక్స్ట్ టైమ్!" అన్నాడు ఆదిత్య. అతని నాలుక కాస్త తడబడుతూ వుంది. డ్రింక్స్‌లో మునిగి తేలుతున్న వాళ్ళను చూస్తే సుకన్య కెందుకో భయమేసింది.

చిన్నప్పుడు కల్లు, సారా తాగి భార్యలను చితకబాదే భర్తలను చూసిన విషయం గుర్తుకు వచ్చింది. ఛా! వాళ్ళు తాగుబోతులు. వీళ్ళట్లా కాదు! అనుకుంది సుకన్య.

"హైద్రాబాద్ బిర్యానీ ఇక స్టేట్స్‌లోనే! ఓకే!" నవ్వాడు గెస్టుల్లో ఒకతను.

"దటీజ్ కరెక్ట్" అన్నాడు మరో గెస్టు. అందరూ లేచారు. వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యారు. రాత్రి పన్నెండు దాటింది.

"కంగ్రాచ్యులేషన్స్ ఆదిత్య!" అన్నాడో గెస్టు.

"ఆ ప్రాజెక్టు నీదే. ఎంత తొందరగా స్టేట్స్ వస్తే అంత బాగుంటుంది" అన్నాడదే గెస్టు అతను కంపెనీ ఎం.డి. యేమో.

"థ్యాంక్యూ సర్! ఐ లైక్ ఛాలెంజింగ్ వర్క్. థ్యాంక్యూ సర్!" అన్నాడు ఆదిత్య.

"ఛాలెంజింగ్ వర్కులో భార్య గుర్తుంటుందా?" అనుకొని సుకన్య నిట్టూర్చింది.

"సీయూ మిసెస్ ఆదిత్య. వీ విల్ మీట్ యూ ఇన్ యూఎస్ ఎగెయిన్. ఓకే! గుడ్ నైట్" అన్నాడు ఎం.డి. అందరూ వెళ్ళిపోయారు.

ఇల్లంతా నిశ్శబ్దం. ఆదిత్య ఆలోచనల్లో మునిగిపోయాడు. సుకన్య ఆ నిశ్శబ్దాన్ని భరించ లేకపోయింది.

"ఏమిటి స్టేట్స్ పోయే అవకాశమొచ్చిందా?" అడిగింది. వంగి సుకన్య ప్లేట్లు సర్దబోయింది.

"అవన్నీ రేపు సర్దొచ్చు. ఇటురా" అని ఆదిత్య సుకన్యను బెడ్రూమ్‌లోకి లాక్కొని పోయాడు. బాగా తాగి వున్న ఆదిత్య తనను బెడ్రూమ్‌లోకి ఎందుకు లాగుతున్నాడో సుకన్యకు తెలుసు! ఈరోజు ఆనందంతో మత్తుతో తన శరీరంలోని అణువణువును రక్కితినేస్తాడు నిశ్శబ్దంగా. ఏమైనా అంటే "నీకక్కర్లేదా? చెప్పు?" అని తోసేస్తాడు కోపంగా, కసిగా. అతనిలో ఏదో టెన్షన్. ఆ టెన్షన్‌ను తనతో చెప్పి పంచుకోవచ్చుగదా! మాట్లాడడు. తను ఒకర్ని అర్థం చేసుకోలేని ఏమీ తెలియని ఆడది అనుకుంటాడా? సుకన్య బాత్రూమ్‌లోకి పోయి వచ్చేసరికి ఆదిత్య గాఢంగా నిద్రలో వున్నాడు. మళ్ళీ నిశ్శబ్దం! నిశ్శబ్దం! రెండు శరీరాల కదలికల చప్పుళ్ళు, కండరాలుకలిసిన నిస్వనాలు, బెడ్‌షీట్లు తొలిగే ధ్వనులూ లేవు ఇప్పుడు. నిశ్శబ్దం! ఒంటరితనం! రాత్రి! చీకటి! అమెరికా పోతే ఇంకా భయంకరం!

ఈ ఒంటి స్తంభం మేడలో నుంచి ఏ రాజకుమారుడు వచ్చి రక్షిస్తాడు తనను! సుకన్య మెదడు పగిలిపోయే ఆలోచనలు! ఆలోచనలు! ఆమె రక్తనాళాలు చిట్లిపోయే భయంకర ఆలోచనలు, నిశ్శబ్దం! రాక్షసుని ఒంటి నలుపంత గదిలో వ్యాపిస్తున్నది! వ్యాపిస్తున్నది!... సుకన్య ఉక్కిరి బిక్కిరయి పోయింది. ఆ నిశ్శబ్దంలో నిస్తబ్దతతో వుండిపోయింది. సుకన్యకు నిద్ర రాలేదు.

*(2001లో ప్రచురించిన 'మింగుతున్నపట్నం'*
*కథల సంపుటి నుంచి....)*